

# ఆఖరి వేళ

'యోష'

బయట గేటుదగ్గర ఆల్సేషన్ బోయ్ మని మొరుగుతుంటే. ఎవరా అని నా మేడగది మెట్లుదిగి వెళ్ళేను పోర్టికోలోకి. పాపం పోస్టుమాన్ భయంగా దిగులుగా చూస్తున్నాడు, ఆ సింహాన్ని. నేను చిన్నగా నవ్వుతూ 'భయంలేదులే టార్జ్' అని అతనిని వూరడించి, 'యూ షటప్ డామ్ ఫూల్' అని ఆల్సేషన్ను ఒక్క గదుము దదివాను.

నాకు అతను అందించిన ఆ రంగు రంగుల పొడవాటి కవరు చూడగానే మొహం జేవురించినంతపని అయింది. వెంటనే ఆల్సేషన్ను అతనిమీదకు వదులుదామన్నంత కోపం. భ. పోస్టుకు సంబంధించిన కోపం పోస్టుమాన్మీద చూపిస్తేఎలాగ, అని నన్నునేనే సముదాయించుకుని ఆ కవరు గబాలున లాక్కున్నాను. అసలు రూములోకివెళ్ళి హంస తూలికా తల్పంమీద పడుకుని చదువుకోవల్సిన ఆ ఉత్తరం. ఎందుకంటే భర్త గారు రాసింది కదా. ఆ భర్తగారు వేం మైళ్ళదూరంలో వేలరూపాయల సంపాదనలో మునిగితేల్తూ, నామమాత్రపు భర్తగానే మిగిలిపోతే హంసతూలికా తల్పంకాదు, అంగారతల్పంమీద పడుకో బెట్టినట్లనిపిస్తుంది.

అయినా కవరు విప్పక తప్పదు కనుక...

డియర్ సునందా!

(హా. ఒకటే పిలుపు, యిప్పటికి రాసిన ముప్ఫయి వుత్తరాల్లో. ముందు

ముందు ఏం విషయాలుంటాయో కూడా నాకు తెల్సు. నేను క్షేమంగా వున్నాను. నీవు క్షేమం అని తలుస్తాను. యిక్కడ ఈ అమెరికన్లు గడిపే జీవితం చూస్తే నీవు ఆశ్చర్యపడతావు అంటూ అక్కడ ధన సమృద్ధతతో కూడా వచ్చిన అలవాట్లు...ఆ మొనాటనీస్ టి.వి. ప్రోగ్రామ్సు, ప్రతీ అడుగు కదల్చకుండానే బటను నొక్కే వ్యవహారాలు...ఛీ. యివన్నీవున్నా నా ఒంటరితనంగురించి ఒక్క ఓదార్పు వాక్యం వుండదు. నా ఫీలింగ్సుగురించి తనకు పట్టదు. అసలే నాలో ఎమోషన్ జాస్తి. ఈ మంచుమనిషితో వేగలేక చస్తున్నాను. నన్ను వేగమని నాన్న నా నుదుటన తన చేత్తో రాసిన రాత యిది. నాన్న స్టేటస్‌కు ఎక్కువ విలువ యిస్తారు. అందుకే ఫారెన్ రిటర్న్డ్ అల్లుడయితేనేగానీ, ఆయన అంతస్థు ఎక్కలేదని ... ఫారెన్ ...ఫారెన్... ఫారెన్...ప్రతీ వెధవకు యిదొక జబ్బు+పిచ్చి అయిపోయింది. మన దేశానికి ఎంత నష్టమో ఆర్థికంగా, ఆలోచించరెందుకో ... నా వూహలు పాదరసం చుక్కల్లా నిలువక జారుతున్నాయి. నిజానికి శ్రీధర్ ఫారిన్ వెళ్ళడం అందరూ నా గొప్ప అదృష్టంగా పొగిడేరు. నేనే ఫారెన్ వెళ్ళినంత హంగామా చేసేరు. నాకు మాత్రం ఫారెన్ అంటే చాలా మంట. ఆ 'యా'లు 'ఈ'లు భుజాలు ఎగరవేయడాలు, తెచ్చిపెట్టుకున్న కృత్రిమపు నవ్వులూ ...భార్య గదిలోకి వెళ్ళాలంటే భర్త అడిగి పర్మిషన్లూ...చివరికి ఆ నిమిషాల్లో...కూడా ఒకరి పర్మిషను ఒకరు అడిగి తీసుకుంటారేమో. యింక వుద్రేకం గానీ, నాచురాలిటీగానీ ఏదీ? సప్రెస్డ్ ఎమోషన్స్‌తో ఫారినర్స్ బాధపడే సైకలాజికల్ జబ్బులు ఎవరి కళ్ళకూ ఆలోచనకూ అందవా?"

నా వూహలు అదుపులో పెట్టుకుంటూనే శ్రీధర్ వుత్తరం చదవడం ముగించేను. ఎంతో బలవంతంగా జవాబు రాయాలికనుక రాయాలి. ఒక్కో వుత్తరం ఒక్కో మంచుముక్క మింగినట్టుగా ఫీలింగు యిస్తుంటే యింక నేను వేడిగా మనిషిలా ఏం జవాబు రాయగలను? ఈ వేడిని తనలో యిముడ్చుకుంటానని భాస్కర్ ఎంత నచ్చచెప్పినా నేనే సంకోచిస్తున్నాను. సహారాలాంటి ఈ ఒంటరితనంలో భాస్కర్ పరిచయం ఒక ఒయాసిస్. నేను ఒడ్డునే నిలబడి చూపులతోనే ఆ ఒయాసిస్‌ను చూసి తృప్తిపడుతున్నాను, సాహసించి దప్పిదీర్చుకోలేక.

నాన్నమీద ఎంతో కోపం తెచ్చుకుందామనుకున్నా తెచ్చుకోలేక పొయ్యాను. ఎలా తెచ్చుకోను? తెచ్చుకున్నా చూపించడానికి నేనూ స్వర్గమో నరకమో వెళ్ళాలి. అక్కడికి వెళ్ళా

లంటే ఏ ప్లేన్ క్రాష్ అవుతుందో తెల్సుకుని మరీ వెళ్ళాలి. బెంగుళూరుకే. పాపం! ప్లెయిన్ ట్రావెల్ అంటే స్టేటస్ సింబల్ అని రైల్లో ఫస్ట్‌క్లాసులో ప్రయాణం చేయడానికికూడా గౌరవ లోపంగా భావించే నాన్న. ఆ ప్లెయిను గుండెమంటలలోనే ఆహుతి అవుతాడని ఎవరు అనుకున్నారు కానీ నా మెడకో గుదిబండ తగిలించేరు ... శ్రీధర్... శ్రీధర్ ఒక్కోసారి ఈ అరతులం మంగళసూత్రాలే, అరుటన్నులబరువున్న యినప గుండ్లలా అనిపిస్తుంటే తీసిపారేయాలనిపిస్తున్నా...

యింతలో బర్‌మని స్కూటర్ చప్పుడు... నాకు తెల్సిందే. చాలా సంతోషం కలిగించే ధ్వని.. ఆ పెట్రోలు వాసనే పరమాద్భుత సుగంధం... బలంగా, అందంగావున్న భాస్కర్ మూర్తి నాకేసే చూస్తూ కదిలింది. నేను చిన్నగా చేయి వూపేను.

కబుర్లలో కాలం రాకెట్‌లా దూసుకుపోయింది. మళ్ళీ వారంరోజుల తర్వాత ...కుక్క మొరుగు...జార్జి భయం కళ్లు...నేనూ ఆ రంగుల కవరు లాక్కోవడం యధాతథంగా. యిక ఈ జీవితమంతా యిలాగే ఈ పొడుగాటి రంగుల కవర్ల ట్రాజడే కావచ్చు. పెళ్ళయినట్టు కాదు...కానట్టూకాదు...అయినా కవరు విప్పేను...మూడు నిమిషాల తర్వాత ...పెద్దగా నవ్వేను...గిరగిర ఆనందంలో తిరిగేను. మొదటిసారిగా కవరును దాదాపు మూడుపదుల ముద్దులు పెట్టుకున్నాను. నేను పెళ్ళయిన కొత్తలో కూడా శ్రీధర్ అంటే అంత మమకారం చూపించలేదు. ఏ కారణమయినా చూపించడానికి మేం కల్సివున్న కాలమే అతి తక్కువ ఆవేళ శ్రీధర్ వుత్తరం అంటే వల్లమాలిన ప్రేమ...

ఎందుకంటే...డియర్ సునందా!

యింక నీవు హాయిగా మర్చిపోయే ప్రయత్నంచేయి. నాకు "దర్టీ యిండియాకు" రావాలనిలేదు. ఆ దర్టీ పీపుల్‌తో కలవాలనిలేదు. నేను యిక్కడే నాతోపాటే పార్ట్‌నర్‌గావున్న మిస్ లూసీ అనే అందమయిన విడోని పెళ్ళిచేసుకున్నాను. ఓ పది సంవత్సరాలు పెద్దే అయినా పది లక్షల ఆస్తికి వారసురాలు. నీకు ఈ వార్త విని చాలా విచారం కల్గుతుందని నాకు తెల్సు. అయినా నేనేం చేయను! ఏమీ చేయలేను. నీకు నానుండి పూర్తి రిలీఫ్ కల్గించడానికి నా సమ్మతితో నీకు మరో వివాహానికి అనుమతించే డాక్యుమెంట్సు పదిహేనురోజుల్లో పంపుతాను. విష్‌యూ బెస్ట్ ఆఫ్ లక్.

గుడ్ బై.

శ్రీధర్.

స్కూటర్ చప్పుడు...ఈసారి నిర్భయంగా భాస్కర్ వైపుచూసి నవ్వేను. ఎదురుగ్గా వెళ్ళి. గొప్ప రిలీఫ్‌తో. రంగుల కవర్ల ట్రాజెడీనుండి విముక్తితో.